క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి:అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణసేవ శుక్రవారం ఉదయం అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. ఆశ్వయుజ మాస శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా సమేతుడైన సూర్యనారాయణుని ఉత్సవమూర్తులను కల్యాణమూర్తులుగా అలంకరించి అనివెట్టి మండపంలో కొలువుదీర్చారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు సాందీప్‌శర్మ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రూ.500 చెల్లించిన భక్తదంపతులు సంప్రదాయ వస్త్రాలతో హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో క్రైస్తవుల ప్రార్థనలు



డానియేలును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలో ఎలోహిమ్ ప్రేయర్ టీమ్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. రెవ.డాక్టర్ ఎస్.సురేష్ ఐజాక్ ఆధ్వర్యంలో ఏడురోడ్ల కూడలి వద్దగల రాయ్ బిల్డింగ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రెవ.డాక్టర్ కె.డానియేలు దైవ సందేశం వినిపించారు. క్రైస్తవ సోదరులు పాల్గొని దేశ క్షేమం కోసం ప్రార్థనలు చేశారు.

సూర్యఘర్ యోజనపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారావు

జి.సిగడాం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు కోరారు. శుక్రవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ కాయల రమణ, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి అభినందనల వెల్లువ



ఎస్‌ఈసీ మెంబర్ గొండు కృష్ణమూర్తిని సన్మానిస్తున్న పార్టీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు

గార: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన గొండు కృష్ణమూర్తికి అభినందనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, వెలమ కుల రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, గార ఎంపీపీ, పార్టీ అగ్రికల్చరల్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురామ్, పార్టీ మండల అధ్యక్షుడు పీస గోపి, పీస శ్రీహరిరావు, గార మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, శ్రీకాకుళం రూరల్ నాయకులు చిట్టి జనార్ధన, మూకాళ్ల తాతబాబు, శ్రీకాకుళం నగర నాయకులు సాధు వైకుంఠరావు తదితరులు అభినందించారు. జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, యజ్జల గురుమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు ముకుందరావు, ఆర్.ఈశ్వరరావులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

తీరంలో అప్రమత్తం



పెదగనగళ్లవానిపేటలో కోతకు గురైన తీరం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట సమీపంలో సముద్ర తీరం ప్రమాదకరంగా మారింది. గురువారం కురిసిన భారీ వర్షానికి శుక్రవారం రాత్రి తీరం కొట్టుకుపోయే ప్రమాదం ఉండడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పడవలు, వలలను ఒడ్డుకు చేర్చారు. నాగావళి నది ఉధృతంగా ప్రవహించడంతో సముద్రపు గట్టు ఇప్పటికే కోతకు గురైంది. తహశీల్దార్ గణపతిరావు, ఎంపీడీఓ ప్రకాశరావులు తీర ప్రాంత వాసులను అప్రమత్తం చేశారు.



గోసాంలో నేలకొరిగిన బొప్పాయి చెట్లు



గార శివారులో సీఎస్పీ రోడ్డుపై ఏర్పాటు చేసిన బారికేడ్లు



గార శివారులో రోడ్డుపైకి ప్రవహిస్తున్న వంశధార వరద నీరు

గాలివాన.. గాఢాంధకారం!

- పండగ పూట వణికించిన వర్షం
- ఈదురుగాలుల బీభత్సం
- చెట్లు, స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం



ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ వద్ద 5 మెగా వాట్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న విద్యుత్ ఇంజినీర్లు



శ్రీకాకుళం: 80 అడుగుల రోడ్డులో నేలకొరిగిన చెట్టు

పండగ పూట గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షంతో పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. జిల్లా కేంద్రంలో రైతుబజారు, జిల్లా పరిషత్, ఆర్టీసీ కాంప్లెక్స్, హడ్కోకాలనీ, డీసీసీబీ కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లే జలమయమయ్యాయి. పలుచోట్ల చెట్లు, స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గురువారం సాయంత్రం నాటికి కూడా సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు అంధకారంలో మగ్గిపోయారు. శుక్రవారం నాటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. నాగావళి నదికి వరద వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గురువారం కలెక్టర్ ప్రకటించడంతో నగర ప్రజలు ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాల వారు కంటిమీద కునుకు లేకుండా గడిపారు. శుక్రవారం నాటికి వాతావరణంలో మార్పు కనిపించినప్పటికీ నదిలో నీటి మట్టం పెరుగుతుండడం, ఎగువన ఇప్పటికీ వర్షాలు కురుస్తుండడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన చెందారు. అయితే వరద ముప్పు తప్పినట్లేనని జిల్లా అధికారులు శుక్రవారం సాయంత్రం ప్రకటించడంతో నగరవాసులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



గార: తంగుళ్లపేట వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



రణస్థలం: గోసాంలో కూలిన కొబ్బరిచెట్టు



రణస్థలం సమీపంలో హైవేపై నేలకొరిగిన చెట్టు



గార: తాన్‌సాహెబ్‌పేట కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం క్రైమ్: బలగ సమీపంలో నాగావళి నదీ తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు



గార: కళింగపట్నం రోడ్డులో చెట్లు తొలగిస్తున్న సిబ్బంది



జి.సిగడాం: చెట్లు పడిపోవడంతో పాలఖండ్యాం-సంతవురిటి గ్రామాల మధ్య నిలిచిన వాహనాలు



జి.సిగడాంలో రోడ్డుపైకి నీరు రావడంతో చేపలు పడుతున్న చిన్నారులు



శ్రీకాకుళం రూరల్: లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్‌ఐ



రణస్థలం: పైడిభీమవరం-సంచాం రహదారిలో ఉధృతంగా గెడ్డ



శ్రీకాకుళంలో జలమయమైన ఇందిరానగర్ కాలనీ



జి.సిగడాం: సారధి వంతెనపై ప్రవహిస్తున్న నీరు



గార వద్ద వంశధార ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీపీ గొండు రఘురాం, అధికారులు



శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల గేటు వద్ద నిలిచిన నీరు

రూ.50 లక్షలతో డోలో మండప నిర్మాణం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం డోలో మండపం పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దేవేంద్రనాయుడు, ప్రధాన అర్చకులు అరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. నిర్దేశిత స్థలంలో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోలో మండపంతో పాటు కల్యాణ మండప నిర్మాణం పైఅంతస్తులో చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. రూ.50లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి ట్రస్టు బోర్డులో ఆమోదం పొందాక దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు పంపిస్తామన్నారు.



డోలోమండప స్థలాన్ని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలో ఓ బాలిక అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఒకటో పట్టణ ఎస్‌ఐ-2 బొడ్డేపల్లి రామారావు శుక్రవారం తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న తన చిన్న కుమార్తె గత నెల 29న ఇంటి నుంచి కళాశాలకని బయటకు వెళ్లి తిరిగి రాలేదని సంతోషిమాత గుడి సమీపంలోని బయ్యన్నపాలెం వీధికి చెందిన తండ్రి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశ ప్రజలు స్వదేశీ వస్తువులు కొనుగోలుచేసి, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, దేశంలో తయారైన వస్తువులకే అధిక ప్రాధాన్యమివ్వాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గాంధీ జయంతి, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా ఖాదీ సంత ఏర్పాటును చేశారు. ఎన్ఈఆర్‌తో పాటు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



జి.సిగడాం: పెంట గ్రామంలో దేవీ విగ్రహం ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్/జి.సిగడాం: శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయాలు, పీఠాలు, నివాసాలు, షాపుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో ఏర్పాటు చేసిన దేవీ విగ్రహాలను పలుచోట్ల ఊరేగింపుతో తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



నానుబాలవీధిలో రాజరాజేశ్వరిగా



మొండేటివీధిలో లలితాదేవి

అరకొర బస్సులతో అవస్థలు

- దసరా సందడి ముగియడంతో కిటకిటలాడిన కాంప్లెక్స్
- ప్రయాణికులకు గంటల తరబడి తప్పని నిరీక్షణ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ గురువారం కిటకిటలాడింది. దసరా పండగ సెలవులు ముగియడంతో స్వగ్రామాల నుంచి మరలా పనుల నిమిత్తం వెళ్లేవారితో కాంప్లెక్స్ రద్దీగా కనిపించింది. విశాఖపట్నం వెళ్లే నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు బారులు తీరారు. జిల్లా కేంద్రం నుంచి మారుమూల గ్రామాలైన పాలకొండ, కొత్తూరు, బత్తిలి, పాతపట్నం, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు కాంప్లెక్స్‌కు చేరుకుని బస్సుల కోసం పడిగాపులు కాశారు. సకాలంలో బస్సులు లేకపోవడంతో బస్‌స్టాప్ ఫుట్‌పాత్‌ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉన్నారు. వచ్చిన అరకొర బస్సులు వచ్చినట్లుగానే ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కొందరు సీట్ల కోసం ఎగబడ్డారు.



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు



బస్సులోకి ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

సత్యం, అహింసతోనే దేశ స్వాతంత్య్రం



శ్రీకాకుళం అర్బన్: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న స్మృతివనం కమిటీ ప్రతినిధులు



జి.సిగడాం ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం అర్బన్ : సత్యం అహింస పోరాట మార్గాలు ప్రపంచానికి చూపించి విశ్వశ్రేణి నాయకుడిగా జాతిపిత మహాత్మా గాంధీ నిలిస్తే, నీతి నిజాయితీలకు ప్రతిబింబంగా దేశ రెండవ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి పేరుగాంచారని గాంధీ మందిర కమిటీ వక్తలు కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల సంఘసంస్కర్తల స్మృతివనంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఘనంగా నిర్వహించారు. విగ్రహ సమర్పకులు డాక్టర్ దానేటి శ్రీధర్, వావిలపల్లి జగన్నాథం నాయుడు తోపాటు కమిటీ ప్రతినిధులు బాపూజీ, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ పైడి సింధూర, పైడి హరనాధరావు, నటుకుల మోహన్, మాధవి, బాలాజీ, మహిబుల్లాఖాన్, మెట్ట అనంతంభట్లు, చౌదరి రాధాకృష్ణ, జి.నాగేశ్వరరావు, శాస్త్రి, రాజారావు, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, సంతోష పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్ : స్థానిక ఎల్‌బీఎస్ కాలనీ పార్కులో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి పలువురు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ద్వారపు అజిత్‌కుమార్, బరాటం లక్ష్మణరావు, దీపక కర్నాని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ మందిరంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జి.సిగడాం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నర్సింహంమూర్తి అన్నారు. పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంచిరెడ్డి శ్రీనివాసరావు, బాలి అప్పలరాజు, ఎలకల ఆదినారాయణ, జనార్దనరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం పాతబస్టాండ్: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రీకాకుళం కల్చరల్: ఎల్‌బీఎస్ కాలనీలో లాల్‌బహదూర్ శాస్త్రి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వివిధ రకాల వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రజలంతా అవగాహన చేసుకుని సామగ్రి కొనుగోలు చేసుకోవాలని జెడ్పీటీసీ కాయల రమణ, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ అన్నారు. శుక్రవారం జి.సిగడాంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేపట్టారు.